సాక్షి
పల్నాడు
సోమవారం । 11 । ఆగస్టు । 2025



పోలేరమ్మ బోనాల ఉత్సవం

కారెంపూడి: బట్టువారిపల్లెలో పోలేరమ్మ బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. మహిళలు ఆదివారం ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి, పోతురాజుకు నైవేద్యం సమర్పించారు.



పార్వతీదేవికి పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



పిడుగురాళ్ల: పట్టణం లోని గంగమ్మ తల్లిని ఆదివారం పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంక్షేమం ప్రశ్నార్థకం..!

- తరచూ బయట వ్యక్తులు వచ్చి యథేచ్ఛగా దందాలు
- అడ్డగోలు వ్యవహారాలకు నిలయాలుగా మారిన వైనం
- తాజాగా దాచేపల్లి హాస్టల్‌లో విద్యార్థిపై దుర్మార్గంగా దాడి
- హాస్టళ్లలో ఉండేందుకు భయపడుతున్న విద్యార్థులు

కనీస రక్షణ ఏర్పాట్లు లేని సంక్షేమ వసతి గృహాలు

సంక్షేమ హాస్టళ్లలో నిరుపేద విద్యార్థులు ఉండి చదువుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వారికి మౌలిక వసతులు ఎలాగూ కల్పించడం లేదు. దీనికితోడు కనీస రక్షణ కూడా లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల ఉన్న కొద్దిమందే అరకొరగా అన్ని రకాల విధులు నిర్వహిస్తున్నారు.

దాచేపల్లి: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు అడ్డగోలు వ్యవహారాలకు అడ్డాగా మారుతున్నాయి. కనీస రక్షణ సౌకర్యాలు లేని హాస్టళ్లలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వ వసతిగృహాలలో బయట వ్యక్తుల ప్రమేయాలు ఎక్కువ అయ్యాయి. వారు దందాలు చేస్తూ విద్యార్థులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాజాగా దాచేపల్లి ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఓ జూనియర్ విద్యార్థిపై బయట చదువుకుంటున్న ఓ సీనియర్ విద్యార్థి దాడి చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనతో సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు కనీస రక్షణ సౌకర్యాలు లేవనే విషయం మరోసారి స్పష్టమైంది.

ప్రైవేటు వ్యక్తుల హల్‌చల్

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ప్రైవేట్ వ్యక్తులు దందాలు సాగిస్తున్నారు. తమ వ్యక్తిగత కార్యకలాపాలతోపాటుగా అక్కడి విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారు. దాచేపల్లి బీసీ హాస్టల్‌లో జరిగిన ఘటనే ఇందుకు ఉదాహరణ. హాస్టలుకు సంబంధం లేని ఓ విద్యార్థి తన వ్యక్తిగత విషయంపై మరో విద్యార్థిని అక్కడి తన స్నేహితుల వద్దకు పిలిచి చితకబాదాడు. హాస్టల్లో తన స్నేహితులు ఉండటం వల్ల వారి అండతో చితకబాది హత్య చేసేందుకు ప్రయత్నాలు చేయటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. సదరు సీనియర్ విద్యార్థి ఇదే హాస్టల్లో ఉంటున్న ఎంతోమంది విద్యార్థులను వివిధ రకాలుగా వేధింపులకు గురిచేసినట్లు కొందరు బాధితులు చెబుతున్నారు. అతడితోపాటు హాస్టల్లో ఉంటున్న మరో ఇద్దరు సీనియర్ విద్యార్థులపైనా వార్డెనుకు ఫిర్యాదులు అందాయి. ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో వారి ఆగడాలు కొనసాగుతున్నాయి. దాచేపల్లితోపాటు ఇతర ప్రాంతాల్లోని హాస్టళ్లలో కూడా జూనియర్లకు, సీనియర్లకు మధ్య గొడవలు జరుగుతున్నాయి.



కనీస రక్షణ చర్యలు లేని ప్రైవేటు రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్న దాచేపల్లిలోని బీసీ బాలుర వసతిగృహం

సొంత భవనాలకు దిక్కులేదు



విద్యార్థుల గదికి తలుపులేని దృశ్యం

జిల్లా వ్యాప్తంగా కొన్ని హాస్టళ్లకు ప్రభుత్వ భవనాలున్నాయి. మరికొన్ని ప్రైవేట్ భవనాలు, రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు. దాచేపల్లిలోని బీసీ బాలురు వసతి గృహం, బాలికల వసతి గృహం కూడా ప్రైవేట్ రేకుల షెడ్డుల్లోనే కొనసాగుతున్నాయి. ప్రహరీ సరిగా లేదు. విద్యార్థులు ఉండే గదులకు తలుపులు కూడా సక్రమంగా లేకపోవడం, వ్యక్తిగత మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. కరెంటు సౌకర్యం కూడా అంతంత మాత్రంగా ఉండడంతో విద్యార్థులు రాత్రి వేళలో భయపడుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత



అధ్వానంగా వ్యక్తిగత మరుగుదొడ్లు

వసతి గృహాలలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో వీటి నిర్వహణ బాధ్యత కత్తి మీద సాములా మారింది. దాచేపల్లిలో రెండు హాస్టళ్లకు మాచర్లలో హాస్టల్ వార్డెన్‌గా ఉన్న వ్యక్తి ఇన్‌చార్జిగా ఉన్నారు. బాలుర వసతి గృహానికి కూడా సదరు మహిళా వార్డెనే ఇన్‌చార్జిగా ఉండటంతో విద్యార్థులపై నియంత్రణ కొరవడింది. ఇక్కడ బీటెక్, డిగ్రీ విద్యార్థులు కూడా ఉండటం వలన సీనియర్‌లకు చెప్పేందుకు మహిళా వార్డెన్ చొరవ తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లోనూ సిబ్బంది కొరత ఉన్నట్లు సమాచారం. కొన్నిచోట్ల వార్డెన్, కుక్, కమాటి, వాచ్ మెన్‌లలో ఒకరుంటే ఒకరు లేరు. అవుట్ సోర్సింగ్ ద్వారా సిబ్బందిని తీసుకుంటున్నా కొరత ఎక్కువగానే ఉంది. ఇకనైనా కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాగార్జునకొండను సందర్శించిన శ్రీలంక బౌద్ధుల బృందం



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం శ్రీలంక దేశానికి చెందిన 45 మంది బౌద్ధుల బృందం సందర్శించింది. వీరు నాగసిరి లాంచీలో నాగార్జున కొండకు చేరుకొని అక్కడి మ్యూజియంలో ఉన్న 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని పుట్టుకకు సంబంధించిన శిలా ఫలకాలు, రాతి సామగ్రి, సింహళ విహార్‌లోని మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నాన ఘట్టం తిలకించి బౌద్ధ గురువు దలైలామా నాటిన బోధి వృక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంఫీ స్టేడియం, 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. పర్యాటకులు లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లిన నేపథ్యంలో పర్యాటక శాఖకు 72 వేల రూపాయల ఆదాయం చేకూరినట్లు అధికారులు తెలిపారు.

లాంచీ స్టేషన్‌ను సందర్శించిన జీఎం



విజయపురిసౌత్: పర్యాటక శాఖ జీఎం చందన నాంచారయ్య ఆదివారం లాంచీస్టేషన్‌ను పరిశీలించారు. మరమ్మతులకు గురైన లాంచీని రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హరిత రిసార్ట్స్ ఉద్యోగులకు సూచనలు చేశారు. లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా, విజయవాడ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, రిసార్ట్స్ మేనేజర్ మస్తాన్ రావు, పులుసు వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా దివ్యబలిపూజ



విజయపురి సౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. తోటివారిని ప్రేమించటం క్రైస్తవ్యంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్య మూర్తి మేరిమాత అని కొనియాడారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలాద్రిపై ఉన్న కనక దుర్గమ్మ ఆలయానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన శీల రమ్య కుటుంబం అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి రూ. 5,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు ఇచ్చారు. గుంటూరు పట్టాభిపురానికి చెందిన విజయ్ శైలేంద్ర అమ్మవారి ఉచిత ప్రసాద పంపిణీకి రూ. 90 వేలు విరాళాన్ని అందజేశారు. డోనర్ సెల్‌కు రూ.10 వేల విలువైన బీరువాను అందించారు. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన బాలా ప్రగడ ఎస్ఎస్ కామేశ్వరి కుటుంబం దుర్గగుడి అభివృద్ధి పనులకు రూ.1,07,900 విరాళాన్ని అందజేసింది.

ఆర్టీసీ డిపోలో వసతుల కల్పనకు కృషి




తెనాలిఅర్బన్: ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోను ఆదివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజయవాడకు 19, గుంటూరుకు 34 సర్వీసులను మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీ



తెనాలి: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పచ్చకామెర్లకు చికిత్స తీసుకుంటున్న రోగితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 30–40 మంది రోగులతో మాట్లాడానని, వారంతా ఆసుపత్రిలో వైద్యసేవలతో సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి చెప్పారు. రోగనిర్ధారణకు వినియోగించే సీటీ స్కాన్ చెడిపోయి చాలా కాలమైనా కొత్త పరికరం ఏర్పాటు చేయకపోవటం తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు



చీరాల: అంతర్ జిల్లాల 36వ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు స్థానిక వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కళాశాలలో హోరాహోరీగా జరుగుతున్నాయి. బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పోటీల్లో 1500 మంది బాలబాలికలు పాల్గొన్నారు. చీరాలలో మొదటిసారిగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడంతో తిలకించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఆర్గనైజింగ్ కమిటీ తరపున అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ధరల దరువు.. ఎరువు బరువు

- అమాంతం పెరిగిన ఎరువుల ధరలు
- మూడు సార్లు పెంచిన కంపెనీలు
- నోరు మెదపని కూటమి ప్రభుత్వం
- ఒక్కో రైతుపై రూ.4 వేల అదనపు భారం
- గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలు
- పెట్టుబడి భారం పెరగడంతో కష్టాలు

కూటమి పాలకుల నిర్లక్ష్యంతో అన్నదాత గుండె బరువెక్కుతోంది. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయిన వారిపై ఎరువుల ధరల పెంపు అదనపు భారం మోపింది. వ్యవసాయం అంటేనే చిన్నచూపు చూసే చంద్రబాబు పాలనలో పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగిపోతున్నాయి. దీంతో సాగు చేయాలంటేనే అన్నదాతలు భయపడే పరిస్థితి నెలకొంది.

ముప్పాళ్ళ: వ్యవసాయంలో ప్రధానమైన ఎరువుల ధరలు అమాంతం పెరిగాయి. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నామమాత్రం కావటంతో ఎరువుల వాడకం మరింత పెరిగింది. గతంలో ఎరువుల ధరలను పెంచే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండేది. ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా ధరలు పెంచుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం ఫర్టిలైజర్ కంపెనీలకు ఇవ్వడంతో ధరలు ఏడాదిలో రెండు, మూడు సార్లు పెంచేస్తున్నారు. ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న పాపాన పోలేదు. దీంతో కంపెనీలు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుకుంటూ పోతున్నాయి. రైతన్నలకు సాగు మరింత భారంగా మారుతోంది.

కంటితుడుపు చర్యలతో సరి

మండలంలో ఏడాదికి దాదాపు 4 వేల టన్నుల రసాయన ఎరువులు వినియోగిస్తుంటారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా. ఒక్కో బస్తా (50 కేజీలు)పై కనిష్టంగా రూ.50–గరిష్టంగా రూ.300 వరకు పెరిగింది. టన్నుపై కనిష్టంగా రూ.1,000 నుంచి గరిష్టంగా రూ.4 వేల వరకు ధర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. సాగును ప్రోత్సహించేందుకు కంటితుడుపు చర్యలే తప్ప కూటమి ప్రభుత్వంలో రైతుకు ప్రోత్సాహకాలు అందటం లేదు.

పెరుగుతున్న వాడకం

వర్షాలతో ఖరీఫ్ సీజన్ కూడా ముందుగానే మొదలైంది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగంతో వ్యయం విపరీతంగా పెరిగింది. ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపకపోవటంతో సాగు భారంగా మారింది. ఖరీఫ్‌లో సాగు చేసే పత్తి, మిరప, పసుపు, మొక్కజొన్న పంటలకు యూరియాతోపాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. వీటితో పాటుగా 14–35–14, 20–20–0–13, 10–26–26 ఎరువులను వాడుతున్నారు. ఎకరాకు కనీసం 10 నుంచి 16 బస్తాల వరకు వినియోగిస్తున్నారు. ఆ మేర నిల్వ చేసుకుంటారు. దరలు పెరగటంతో రైతులకు శాపంగా మారింది. ఒక్కో రైతుపై రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు భారం పడనుంది.



ముప్పాళ్ళ సొసైటీ గోదాములో నిల్వ ఉన్న యూరియా బస్తాలు

పెరిగిన ఎరువుల ధరలు (రూ.లలో)

ఎరువు రకం	పాతధర	కొత్త ధర
20-20-0-13 (గ్రోమోర్)	1,300	1,350
20-20-0-13 (ఫ్యాక్ట్)	1,300	1,425
20-20-0-13 (పీపీఎల్)	1,300	1,400
10-26-26	1,470	1,800
14-35-14 (గ్రోమోర్)	1,700	1,800
సూపర్‌ఫాస్పేట్	580	640
పొటాష్	1,535	1,700
16-20-0-13	1,250	1,300

వైఎస్సార్‌సీపీ హయాంలో మేలు

2014–19 వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పట్లో కూడా నాలుగైదు సార్లు రసాయన ఎరువుల ధరలు పెరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019–24 కాలంలో రసాయన ఎరువుల ధరలు ఒక్కసారిగా కూడా పెరిగిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలల్లోనే రైతుల నడ్డి విరిచేలా మూడు దఫాలుగా ధరలు పెంచడం గమనార్హం. పైగా రైతు భరోసా కేంద్రాల నేరుగా రైతులకు గ్రామంలోనే ఎరువులు అందించారు. నేడు వాటి కోసం రైతులు పట్టణాలకు, మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది.

మూడు నెలలకోసారి పెంపు



నేను ఏటా పది ఎకరాల్లో పసుపు, మొక్కజొన్న, వరి, అరటి పంట సాగు చేస్తుంటాను. మూడు నెలలకొకసారి ఎరువుల ధరలు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో పెట్టుబడి భారీగా పెరిగిపోతోంది. అదే రీతిలో పంటలకు గిట్టుబాటు ధర కూడా పెంచితే సాగు చేసేందుకు రైతు ఆసక్తి చూపుతాడు. గిట్టుబాటు ధర మాత్రం ఏడాది ఒకసారి మొక్కుబడిగా పెంచుతారు.

– లోకసాని నర్సిరెడ్డి, రైతు, ముప్పాళ్ళ

గిట్టుబాటు ధరలూ పెంచాలి



పెరిగిన ఎరువుల ధరలతో ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు భారం పడుతోంది. ఇప్పటికే పండిన పంటలకు గిట్టుబాటు ధర అందక సాగులో కష్టాలు పెరిగాయి. అయినప్పటికీ ఫర్టిలైజర్ కంపెనీలు మాత్రం ఇష్టానురీతిలో ధర పెంచుకుంటూ పోతున్నాయి. ఎరువులపై సబ్సిడీ అందించి రైతులను ప్రోత్సహించాలి.

–బత్తుల శ్రీనివాసరావు, రైతు, చాగంటివారిపాలెం

టేక్.. డైవర్షన్..

శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి కూల్చివేత నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): దశాబ్దాల చరిత్ర ఉన్న గుంటూరులోని శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు ట్రాఫిక్ మళ్ళింపు చేపట్టారు. ఈ నెల 9వ తేదీన బ్రిడ్జి కూల్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. 9వ తేదీ రెండో శనివారం, 10వ తేదీ ఆదివారం కావటంతో కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర కార్యాలయాలకు సెలవులు రావటంతో పెద్దగా ట్రాఫిక్ ప్రభావం లేదనే చెప్పాలి. ఈ క్రమంలో సోమవారం నుంచి ట్రాఫిక్ రద్దీ భారీగా ఉండే అవకాశం ఉంది. కొద్ది నెలల కిందట మూడు వంతెనలు పనులు జరిగిన నేపథ్యంలోనే ట్రాఫిక్‌కు ఎంత అంతరాయం ఏర్పడిందో నగర ప్రజలకు తెలియంది కాదు. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఆదేశాలు మేరకు ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డైవర్షన్‌లు ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉంది. అందుకు తగ్గట్టుగా ట్రాఫిక్ పోలీసులు ఎక్కిడికక్కడ బారికేడ్లతో రోడ్లను మూసి, డైవర్షన్ తెలిపేందుకు సిబ్బందిని కూడా కేటాయించారు. అలాగే డైవర్షన్ తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా స్టేషన్‌ల నుంచి డిప్యూటేషన్‌లపై సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణకు రంగంలోకి దింపారు.

ఈస్ట్ నుంచి ఇలా..

- ఓల్డ్ క్లబ్ రోడ్డు, రామిరెడ్డితోట, నెహ్రూ నగర్, బుచ్చయ్యతోట, మణిపురం ప్రాంతాలకు చెందిన ప్రజలు మూడు వంతెనలు మీదుగా డొంకరోడ్డు వైపు నుంచి శ్రీనగర్ మీదుగా అమరావతిరోడ్డు చేరుకోవాలి.
- క్లాత్‌బజారు, రైలుపేట, సాంబశివరావుపేట, నాజ్‌సెంటర్ చుట్టుపక్కల వారు భాస్కర్ డీలక్స్, మూడు వంతెనల మీదుగా గుంటూరు వెస్ట్‌లోకి వెళ్ళాలి.
- ఉమెన్స్ కాలేజి, విజ్ఞాన మందిరం సెంటర్, మార్కెట్ ప్రాంతాల వారు రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా జిల్లా కోర్టు వైపు నుంచి కంకరగుంట బ్రిడ్జి మీదుగా వారి రాకపోకలు సాగించవచ్చు.
- ఆర్టీసీ బస్టాండ్, పాతగుంటూరు , లాలాపేట, పట్నంబజారు, పరిసర ప్రాంతాల వారు హిందూ కళాశాల కూడలి మీదుగా మూడు బొమ్మల సెంటర్, పట్టాభిపురం వైపు ప్రాంతాలకు వెళ్ళవచ్చు.
- మంగళగిరి రోడ్డు, కాకాని రోడ్డు, మంగళదాస్‌నగర్ ప్రాంతాల వారు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డుకు చేరుకోవాలి.

వెస్ట్ నుంచి ఇలా..

- అమరావతి రోడ్డు నుంచి మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వెళ్ళే వాహనాలు చిల్లీస్ పాయింట్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు మార్గంలో ప్రయాణించాలి.
- లాడ్జిసెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్‌కు వెళ్ళే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అరండల్‌పేట, పొట్టి శ్రీరాములు నగర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు, లేని పక్షంలో బ్రాడీపేట, కంకరగుంట ఫ్లైఓవర్, మార్గంలో అటు, ఇటు ప్రయాణించాల్సిన అవసరం ఉంది.
- హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వైపు వచ్చే వాహనాలు (స్కూల్ బస్సులతో సహా) రమేష్ హాస్పటల్, కంకరగుంట బ్రిడ్జి మార్గాన్ని వినియోగించుకోవాలి.
- కోబాల్డుపేట, కృష్ణనగర్, చంద్రమౌళీ నగర్, బృందావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం ప్రాంతాల నుంచి మార్కెట్ వచ్చే వాహనాలు, బ్రాడీపేట 18వ అడ్డ రోడ్డు, కంకరగుంట అండర్‌పాస్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, రమేష్ ఆసుపత్రి మీదుగా చేరుకోవాలి.
- పట్టాభిపురం నుంచి జీజీహెచ్‌కు వెళ్ళే వారు కంకరగుంట బ్రిడ్జి, ఎంటీబీ సెంటర్, ఉమెన్స్ కళాశాల రోడ్డు, పల్లవి థియేటర్ రోడ్డులో ప్రయాణించాలి.
- లాడ్జిసెంటర్– ఎంటీబీ సెంటర్ వైపు వెళ్ళే హెవీ వెహికల్స్ చిల్లీస్,ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఆటోనగర్, బస్టాండ్, కంకరగుంట బ్రిడ్జి మీదుగా వెళ్ళాలి.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

జె.పంగులూరు: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అలవలపాడు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. రేణింగవరం పోలీసులు అందించిన వివరాల మేరకు.. ఇంకొల్లు మండలం హనుమోజీపాలేనికి చెందిన అత్తులూరి ధనుంజయరావు (45) భార్య మహాన్నతితో మోటార్ సైకిల్‌పై కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామంలో వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి జాతీయ రహదారి వెంబడి హనుమోజిపాలెం బయలు దేరారు. అలవలపాడు వద్ద క్రాస్ రోడ్డు దాటుతుండగా, గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో ధనుంజయరావు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య గాయపడింది.

క్లుప్తంగా

వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ కార్యదర్శిగా వేమారెడ్డి



రొంపిచర్ల: ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ కార్యదర్శిగా పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం గ్రామానికి చెందిన దుద్దుకుంట వేమారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.జగదీశ్‌రావు నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. వేమారెడ్డి గతంలో జిల్లా అసోసియేషన్‌లో పలు పదవులు నిర్వహించారు. రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎంపికైన వేమారెడ్డిని సహచర ఉద్యోగులు, ఆ గ్రామ పెద్దలు అభినందించారు.

12 సొసైటీలకు త్రీమెన్ కమిటీల నియామకం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని 12 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం ఆదివారం త్రిసభ్య కమిటీ నియామకం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 821 పీఏ సీఎస్‌లకు కమిటీలను నియామకం చేసింది. కాగా పల్నాడు జిల్లాలోని వీరాపురం సొసైటీకి వై. శివన్నారాయణను చైర్ పర్సన్‌గా నియమించగా, పెదఅగ్రహారం సొసైటీకి పి. మరియమ్మ, మాచవరం సొసైటీకి పసుపులేటి పూర్ణయ్య, మాచర్ల సొసైటీకి జి. సత్యనారాయణరెడ్డి, దుర్గి సొసైటీకి కటకం రామ్మోహన్‌రావు, నందిరాజుపాలెం సొసైటీకి ఓర్సు ఆనందరావు, ధూళిపాళ ఏబీఎఫ్ఎస్‌సీఎస్‌కు కె.సుబ్బారావు, ముప్పాళ్లకు జెట్టి నాగమల్లేశ్వరరావు, మాదల సొసైటీకి చిమటా పోల్‌రాజు, మల్రిపాలెం సొసైటీకి కుర్రా రత్తయ్య, యడ్లపాడు సొసైటీకి ఎం. వెంకట సుబ్బారావు, బొల్లాపల్లి సొసైటీకి పి.వెంకటనారాయణను చైర్ పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వీరితో పాటు సొసైటీకి ఇరువురు చొప్పున పర్సన్‌ల నియామకం చేసింది. వీరు ఈ పదవుల్లో 2026 జనవరి 30వ తేదీ వరకు కొనసాగుతారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



వెంకట స్వామి (ఫైల్)

జె.పంగులూరు: మండలంలోని రేణింగవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పర్వతరెడ్డి వెంకటస్వామి (52) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. వెంకటస్వామి రేణింగవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతని స్వగ్రామం చిన్నగంజాం మండలం సోపిరాల. ఆయన అస్వస్థతకు గురికావడంతో ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటస్వామికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారివురికి వివాహం చేశాడు. వెంకటస్వామి భౌతికకాయాన్ని రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలకు వేళాయె..!

- నేటి నుంచి ఈ నెల 14 వరకు నిర్వహణ
- విద్యార్థి అభ్యసన మదింపునకు ప్రక్రియ
- డీసీఈబీ నుంచి మండలాలకు ప్రశ్నపత్రాలు



సత్తెనపల్లి: విద్యా సంవత్సరంలో విద్యార్థి అభ్యాసన మదింపునకు విద్యాశాఖ ఏటా ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను గత ఏడాది నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ 1, 2, 3, 4గా వ్యవహరిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్న నేపథ్యంలో తొలి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్–1 (శాంప్) ఈ నెల 11 నుంచి నిర్వహించనున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను 2022–23 విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మక విధానంలో 'క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్' ను ప్రవేశపెట్టారు. ఇదే విధానాన్ని ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ కొనసాగిస్తున్నారు. గత విద్యా సంవత్సరం 1–8 తరగతుల వరకు సీబీఏ విధానం అమలు చేయగా, ఈ ఏడాది 9వ తరగతికి కూడా సీబీఏ విధానాన్ని తీసుకొచ్చారు. కేవలం 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఫార్మేటివ్–1 పరీక్షలను జరపనున్నారు.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం...

ప్రస్తుత విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభమైంది. ముందుగా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు ఈనెల 4 నుంచి నిర్వహించాల్సి ఉండగా, అసెస్‌మెంట్ బుక్‌లెట్స్ జిల్లాకు చేరుకోవడం ఆలస్యం కావడంతో ఈనెల 11 కు వాయిదా వేశారు. జూన్, జూలై సిలబస్ కు సంబంధించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మదింపునకు సీబీఏ, ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సిలబస్ తో పాటు, 6వ తరగతికి రెడీనెస్ ప్రోగ్రాం పై పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షల ద్వారా అభ్యాసన లోపాలను గుర్తించడంతోపాటు, పక్కా బోధనతో వారిలో సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్–1,3, ఎస్ఏ 2కు ఫార్మేటివ్ బదులుగా సీబీఏ విధానంలో నిర్వహిస్తుండగా, ఎఫ్ఏ 2, 4, ఎస్ఏ 1 పాత విధానంలోనే నిర్వహించనున్నారు. 10వ తరగతికి నాలుగు ఎఫ్ఏలు, రెండు సమ్మేటివ్ పరీక్షలు పాత విధానంలో అమలు చేస్తారు.

బైలింగ్విల్ ప్రశ్న పత్రాలు..

సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రం బైలింగ్విల్ విధానంలో ఉంటుంది. విద్యార్థికి ఇంగ్లిషులో ప్రశ్నపత్రం అర్థం కాకుంటే తెలుగులో చదివి అర్థం చేసుకునేందుకు 2023–24 విద్యా సంవత్సరం నుంచి బైలింగ్విల్ ప్రశ్నపత్రాలను ప్రవేశపెట్టారు. ప్రశ్న పత్రంలోని 10 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో, ఐదు ప్రశ్నలు రాతపూర్వక విధానంలో ఇస్తారు. మొత్తం 15 ప్రశ్నలకు 20 మార్కులు కేటాయిస్తారు. మెకానికల్ .. అండర్ స్టాండింగ్ .. అప్లికేషన్ (ఎంయూఏ) ప్రశ్న పత్రం ఉంటుంది. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. సీబీఏ విధానంలో పరీక్షలు రాసే విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను ఓఎంఆర్ షీట్లలో నింపాల్సి ఉంటుంది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మాత్రం రాతపూర్వక సమాధానాలు రాస్తే సరిపోతుంది.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

- గొడవలు లేకుండా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలి
- సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు
- లక్కరాజుగార్లపాడు గ్రామంలో కార్డెన్ సెర్చ్



లక్కరాజుగార్లపాడులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు

సత్తెనపల్లి: మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, మద్యం, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు అన్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చదువుకుంటున్న తమ బిడ్డలు హాస్టళ్లల్లో, రూముల్లో ఏం చేస్తున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తల్లి దండ్రు లు కాయా కష్టం చేసి డబ్బు పంపుతుంటే కొందరు యువత చెడు అలవాట్లకు బానిసలై అర్థంతరంగా తమ జీవితాలను ముగించుకుంటున్నారన్నారు. యువకులు బాగా చదువు కొని ఉన్నతంగా ఎదగాలనే ఉద్దేశంతో తల్లి దండ్రులు తమ కష్టాలను సైతం పక్కనపెట్టి ఖర్చు అయినప్పటికీ చదివిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడటంతో యువత మాదక ద్రవ్యాలు, మద్యం, మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు యువతీ,యువకులు తప్పు దోవ పట్టకుండా ఉండాలంటే తల్లిదండ్రులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల్లో కూడా కొంత మార్పు రావాలని, బిడ్డల ముందు మద్యం తాగడం లాంటివి మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల జోలికి వెళ్ళబోమని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఐకమత్యంతో జరుపుకోవాలి...

ఈ నెల 27న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎలాంటి గొడవలు లేకుండా ఐక్యమత్యంతో పండుగ నిర్వహించుకోవాలన్నారు. వినాయక విగ్రహాలకు అనుమతులు తీసుకోవాలని, డీజేలు పెట్టడం, పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, రెచ్చగొట్టే పాటలు వంటివి పెట్టి లేనిపోని గొడవలు సృష్టించవద్దన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ఈ సందర్భంగా కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఇంటింటికి తనిఖీలు చేపట్టి కాగితాలు సక్రమంగా లేని 37 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలతో పాటు 3 గొడ్డళ్లు, 2 బరిశలు స్వాధీన పరుచుకున్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, ఎంవి సుబ్బారావు, సురేష్, శ్రీనివాసరావు, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమినుద్దీన్, మరో నలుగురు ఎస్ఐలు, నలుగురు ట్రైనీ ఎస్ఐలు, 80 మంది పోలీసులు పాల్గొన్నారు.

ఈ ఏడాదికి కొత్త బ్రిడ్జి లేనట్లేనా...!



శిథిలావస్థకు చేరిన వంతెన

ముప్పాళ్ల: సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిలో గుంటూరు బ్రాంచి కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం ఈ ఏడాదికి లేనట్టే. గత ఏడాది డిసెంబర్ 6వ తేదీన ఆర్భాటంగా ప్రారంభించిన నిర్మాణం పనులు ఆరంభ శూరత్వంగానే మిగిలిపోయాయి. సుమారు రూ.120 లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం పనులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కాల్వలకు నీటి విడుదల ఆగిపోయిన తర్వాత మార్చి, ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉంది. అయినప్పటికీ రెండు నెలలు కాలం గడిపి తీరా కాల్వలకు నీటి విడుదల చేసే సమయంలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. ఆ మేర కాల్వలో దోనెలు ఏర్పాటు చేసి అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాల్వలకు నీరు విడుదల చేయటంతో నిర్మించిన అప్రోచ్ రోడ్డును తొలగించారు. కాల్వలకు నీటిని నిలిపివేస్తే తప్ప పనులు ప్రారంభించడానికి వీలు లేదు. మరో ఏడాదిపాటు శిథిలావస్థకు చేరిన వంతెనపై రాకపోకలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన వాహనదారుల్లో నెలకొంది.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఒకరు మృతి
- 11 మందితో వెళ్తుండగా ప్రమాదం



ప్రమాద స్థలంలో ఆటో, చిన్న వెంకటేశ్వర్లు మృతదేహం

క్రోసూరు: ఊటుకూరు–కస్తల మధ్యలో ఆదివారం అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ పి.రవిబాబు తెలిపిన వివరాలు.. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలేనికి చెందిన 10 మంది అచ్చంపేట మండలం కస్తలలోని తమ బంధువుల ఇంటిలో జరిగే పుష్పాలంకరణ వేడుకకు ఆటోలో బయలుదేరారు. క్రోసూరు మండలం ఊటుకూరు మీదగా కస్తల వెళ్లి తిరిగి వస్తూ ఊటుకూరు పరిధిలో అదుపు తప్పి ఆటో పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటోలో ఐదుగురు మహిళలు, ఆరుగురు పురుషులు, డ్రైవర్‌తో కలిపి 11 మంది ప్రయాణిసున్నారు. ఈ ప్రమాదంలో వృద్ధుడు చావలి వెంకటేశ్వర్లు(66) అక్కడిక్కడే మృతిచెందాడు. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కాగా సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వలో దూకి వివాహిత ఆత్మహత్య

కారెంపూడి: స్థానిక వినుకొండ రోడ్డు బ్రిడ్జి అక్విడెక్టు వద్ద శనివారం రాత్రి కారెంపూడికి చెందిన మహిళ సాగర్ కుడి కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె స్థానిక ఇందిరా నగర్ కాలనీ వద్ద చికెన్ దుకాణం నడుపుతున్న రమణగా భావిస్తున్నారు. ఆమె వయస్సు 26 ఏళ్లు. వివాదాల కారణంగా భర్తగా దూరంగా ఉంటూ చికెన్ దుకాణం నడుపుతూ ఇద్దరి పిల్లల్ని పోషించుకుంటోంది. ఆమె ఆత్మహత్యకు పాల్పడడానికి కారణాలు తెలియడంలేదు. ఇదిలా ఉంటే ఆమె మృతదేహం నకరికల్లు కాల్వ లాకుల వద్ద ఆదివారం సాయంత్రం లభ్యమైనట్లు తెలుస్తోంది.

బొప్పూడిలో పేకాట స్థావరంపై దాడి

ఐదుగురు అరెస్టు, నగదు స్వాధీనం

చిలకలూరిపేట టౌన్: మండలంలోని బొప్పూడి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు మెరుపుదాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్‌కు బొప్పూడి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి చేరుకుని మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు కోత ముక్కల ఆట ఆడుతూ పట్టుబడ్డారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.34,400 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్ర స్థాయి ఆట్యా-పాట్యాలో ప్రథమస్థానం



ప్రథమస్థానంలో నిలిచిన జిల్లా బాలబాలికల జట్టు

నకరికల్లు: రాష్ట్రస్థాయి ఆట్యా–పాట్యా క్రీడాపోటీల్లో పల్నాడు జిల్లా జట్లకు ప్రథమస్థానం దక్కింది. ఒంగోలులో ఈ నెల 9, 10వ తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లా బాలికల, బాలుర జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నకరికల్లు ఉన్నతపాఠశాల విద్యార్థులు 11 మంది, దేచవరం ఆదర్శపాఠశాల విద్యార్థులు ముగ్గురు పల్నాడు జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు నకరికల్లు ఉన్నత పాఠశాలలోనే శిక్షణ ఇచ్చారు. బాలికల జట్టు కోచ్‌గా నకరికల్లు ఉన్నతపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.ఝాన్సీరాణి, బాలుర జట్టుకు కోచ్‌గా ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, మేనేజర్‌గా పి.తిరుపతిరావు వ్యవహరించారు. క్రీడాకారులను ఏపీ ఆట్యా–పాట్యా సీఈఓ రంభ.ప్రసాద్, కార్యదర్శి శ్రీ చరణ్, అధ్యక్షుడు జాబేట్, జిల్లా అధ్యక్షురాలు చింతా సామ్రాజ్యం తదితరులు అభినందించారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి



చిలకా సాగర్ మృతదేహం

ముప్పాళ్ళ: ఓ యువకుడు సరదాగా ఈతకు వెళ్ళి మృత్యువాత పడ్డ సంఘటన మండల కేంద్రంలోని పెదనందిపాడు బ్రాంచి కాలువ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చిలకా సాగర్(25) అనే యువకుడు చిలకలూరిపేటలో ఆటో నడుపుతుంటాడు. తనకు మేనల్లుడు వరుసైన వడ్డవల్లి నరేంద్రకు మార్టూరులో డబ్బులు రావాల్సి ఉండగా ఇద్దరూ కలిసి అక్కడికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వేల్పూరు బయలుదేరారు. మార్గమధ్యలో ముప్పాళ్ళలోని పెదనందిపాడు బ్రాంచి కాలువ వద్దకు రాగానే నరేంద్ర పక్కనే ఉన్న దుకాణంలో టిఫిన్ చేసేందుకు వెళ్లగా, సాగర్ ఈత కొట్టేందుకు కాల్వలోకి దిగాడు. నీటి ఉధృతికి డ్రాపులో పడ్డాడు. గమనించిన స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానికుల సాయంతో బయటకు తీశారు. నరేంద్ర ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.

పోరాటానికి, క్రమశిక్షణకు మారుపేరు యూటీఎఫ్

యూటీఎఫ్ సీనియర్ నాయకుడు జోజయ్య



విప్లవ నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పోరాటానికి, క్రమశిక్షణకు యూటీఎఫ్ మారుపేరుగా నిలిచిందని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు కె.జోజయ్య అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ 52వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన జోజయ్య మాట్లాడుతూ యూటీఎఫ్ నిజాయతీకి, త్యాగానికి నిలయం అన్నారు. ఆవిర్భావం మొదలు క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, సంఘాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ సంస్కరణల రూపకల్పనలో అకడమిక్ అంశాలతో పాటు, ఉపాధ్యాయుల కృషి, సమాజ భాగస్వామ్యంలో రావలసిన మార్పులపై దృష్టి పెట్టాలని అన్నారు.
- మరో సీనియర్ నాయకుడు జి.ప్రభుదాస్ చెన్నుపాటి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతూ యూటీఎఫ్‌లో పని చేయడం ఎంతో గర్వకారణమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కార్యకర్తల్లో ఆ స్ఫూర్తి ఉంటుందన్నారు.

కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, సీపీఎస్ కన్వీనర్ సీహెచ్ ఆదినారాయణ, జిల్లా కార్యదర్శులు ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బి. ప్రసాదు ఆడిట్ కమిటీ సభ్యులు కె.ప్రేమ్ కుమార్ రాష్ట్ర కౌన్సిలర్ బి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తొలితరం తెలుగు రచయిత్రులు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణవేదికపై ఆదివారం ప్రముఖ సాహితీవేత్త, ఆచార్య సీహెచ్.సుశీలమ్మ రచించిన తొలితరం తెలుగు రచయిత్రులు అభ్యుదయ కథల పుస్తకావిష్కరణ నిర్వహించారు. కేంద్ర సాహితీ అకాడమి అనువాద పురస్కార గ్రహీత పి.సత్యవతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణకు అంకితం చేసి సత్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సభలో గ్రంథాన్ని విశ్లేషిస్తూ కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ప్రసంగించారు. ఈ పుస్తకంలో వితంతు, స్త్రీల బాధలను, వాటి వెనుకనున్న సామాజిక దుర్మార్గాన్ని, అస్పృశ్యత, అంటరానితనం, అగ్ర వర్గ దురహంకారం వంటి అనేక విషయాలను ప్రస్తావించడం విశేషమని అన్నారు. ఈ పుస్తకంలో 1902 నుంచి 1955 వరకు రచించిన కథ, రచన చేసిన 25 మంది కథారచయిత్రుల రచనలను పరిచయం చేయడంతో పాటు రచయిత్రుల జీవన రేఖలను అందించడం మంచి విశేషమని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పుస్తకావిష్కరణ సత్యవతి, సుశీల, రచయిత్రి అతిథులను సత్కరించారు.

అత్తపై కోడలి దాడి

యడ్లపూడి: అత్తపై కోడలు ఆమె తల్లి దాడి చేసిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రత్నకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పూనూరు ఎస్సీ కాలనీకి చెందిన బేతపూడి ఆదెమ్మ మనుమడు 15 రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో బాలుడు తండ్రి.. ఆదెమ్మ కుమారుడు అయిన శ్రీను మనస్థాపంతో నిత్యం మద్యం తాగుతూ ఉండటంతో తల్లి ఆదెమ్మ.. కుమారునికి రోజూ అన్నం పంపిస్తోంది. తన భర్త నిత్యం మద్యం తాగుతూ తిరుగుతూ ఉంటే కుటుంబం ఎలా జరుగుతుందని శనివారం ఉదయం 11 గంటల సమయంలో కోడలు మాధవి అత్తపై వాగ్వాదానికి దిగింది. ఈ నేపథ్యంలో కోడలు, ఆమె తల్లి కాకాని మరియమ్మ ఇరువురు కలిసి ఆదెమ్మపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆదెమ్మ తలకు తీవ్ర గాయం కాగా ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రజక దివ్యాంగురాలిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలు పాదిలి దేవిక



చీరాలలో సమావేశం అయిన ప్రజా సంఘాలు, రజక వర్కర్స్ అసోసియేషన్

- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బాధితురాలు
- కలెక్టర్, ఎస్పీలను కలవనున్న ప్రజాసంఘాలు, రజక వర్కర్స్ అసోసియేషన్ నాయకులు

పర్చూరు(చినగంజాం): దివ్యాంగురాలైన ఓ రజక యువతిపై కర్రలు, రాడ్లతో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తీవ్ర గాయాల పాలైన ఆ యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయమై కారంచేడు ఎస్ఐ ఖాదర్ బాషా, బంధువులు, ప్రత్యక్ష సాక్షుల సమాచారం మేరకు.. కారంచేడు గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ యార్లగడ్డ శ్రీకృష్ణ, సుజాతలు నివాసముంటున్న అదే ప్రాంతంలో రజక సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నివాసముంటోంది. ఈనెల 8వ తేదీ ఉదయం సుజాత ఇంటి ముందు ముగ్గు వేస్తున్న సమయంలో ఆమెను చూసి నవ్వారనే సాకుతో రజక కుటుంబంతో వివాదానికి దిగారు. అంతేగాకుండా నగదు అప్పు తీసుకొని ఇవ్వలేదనే కోపంతో రజక కుటుంబానికి చెందిన కృష్ణకుమారి, కోటిరత్నం, సునీత, నాగేశ్వరరావులపై సుజాత ఆమె భర్త శ్రీకృష్ణలు దాడికి దిగారు. కర్రలతో దాడి చేసి వారిని తీవ్రంగా గాయపరచారు. అంతటితో ఆగక ఇనుపరాడ్లతో అదే కుంటుంబానికి చెందిన మూగ, చెవిటి యువతి పాదిలి దేవికపై అమానుషంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడమే కాకుండా కులం పేరుతో దూషించి అసభ్యంగా వ్యవహరించారు. ఆ సంఘటనలో దివ్యాంగురాలు స్పృహకోల్పోగా చీరాల ఏరియా వైద్యశాలలో చేర్పించారు. ఆమెకు ఆస్పత్రిలో ఆక్సిజన్ అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడిందని సమాచారం. ఆస్పత్రి వైద్యులు అందించిన నివేదిక మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. దాంతోపాటు దాడికి పాల్పడిన శ్రీకృష్ణ కూడా రజక కుటుంబంపై ఫిర్యాదు చేయగా రెండు కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాదరబాషా తెలిపారు.

న్యాయం చేయాలి

రజక సామాజిక వర్గానికి చెందిన చెవిటి, మూగ యువతి పాదిలి దేవికపై అగ్రవర్ణాలకు చెందిన యార్లగడ్డ శ్రీకృష్ణ అతని భార్య దాడి చేసి గాయపరచిన సంఘటనకు సంబంధించి ప్రజాసంఘాలు, రజక వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. ఆదివారం రాత్రి చీరాల ఎన్‌జీఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. రజక కుటుంబంపై దాడి చేసి మూగ, చెవిటి యువతి దేవికను రాడ్లతో కొట్టి తీవ్రంగా గాయపరచిన సంఘటనపై జిల్లా కలెక్టర్‌ను, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు పెద్దిడపు కొండయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కంచర్ల చిట్టిబాబు, రాష్ట్ర చేనేత నేత మాచర్ల మోహనరావు, సీఐటీయూ నాయకులు పి.వసంతరావు, రజక కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.జనార్దన్, కొండవీటి శ్రీనివాసరావు, పాదిలి సూర్య పాల్గొన్నారు.

లైవ్‌స్టాక్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా అనిల్‌కుమార్

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర కోశాధికారిగా గుంటూరుకు చెందిన చప్పిడి అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన అనిల్ కుమార్‌ను నాన్‌గెజిటెడ్ వెటర్నరీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ సేవానాయక్, జిల్లా చైర్మన్ రాజమోహన్, ఏపీఎన్‌జీజీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శ్యామ్ సుందర శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ షేక్ నాగూర్‌షరీఫ్, నగర అధ్యక్ష కార్యదర్శులు సూరి, కళ్యాణ్, ఇతర సంఘ నేతలు అభినందనలు తెలిపారు.